పెద్దలంటే నాకు గౌరవం

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ఎమ్మెల్యే రాచమల్లు దంపతులకు పూలమాల వేస్తున్న కౌన్సిలర్ అరుణా నాగేంద్ర

ప్రొద్దుటూరు: తనకు పెద్దలంటే గౌరవం.. 80 ఏళ్ల వయసు అంటూ తాను చేసిన వ్యాఖ్యలు మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డిని బాధించి ఉంటే మన్నించాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి కోరారు. ప్రత్యర్థి జీవితం, వ్యక్తిగత విషయాల గురించి తాను ప్రస్తావించాల్సిన అవసరం లేదన్నారు. పత్రికా సమావేశంలో వరదరాజులరెడ్డి మనస్థాపానికి గురైనట్లు తాను గమనించానన్నారు. ఇప్పుడు 85 ఉన్నాయి 91 వస్తాయి.. మరికొన్నేళ్లకు 100 వస్తాయి నా వయసుతో ఏం పని అని ఆయన మనస్థాపంతో మాట్లాడినట్లు అనిపిస్తోందన్నారు. ఆయన బాధపడి ఉంటే మన్నించాలని మరోసారి కోరారు. తన తండ్రి లాంటి వయసే పెద్దాయనదని, తన తల్లికి కూడా 85 ఏళ్లు ఉన్నాయని తెలిపారు. అయితే 85 ఏళ్ల వయసులో ప్రజా సేవకు అర్హుడా, అనర్హుడా అన్నది ప్రజలు తేల్చాలన్నారు. ప్రతి ఇంటిలో పెద్దవారు ఉండాలని కోరుకుంటారని, వారి సలహాలు, సూచనలు, పెద్ద దిక్కు అవసరమని పేర్కొన్నారు. వరదరాజులరెడ్డికి 50 ఏళ్ల వయస్సు ఉన్నప్పుడే ప్రొద్దుటూరును అభివృద్ధి చేయలేకపోయారని, 85 ఏళ్ల వయసులో ఎలా అభివృద్ధి చేస్తారన్నదే తన ప్రశ్నే తప్ప.. వయసు అంశం కాదని తెలిపారు.

కొండారెడ్డికి కౌంటరిచ్చిన ఎమ్మెల్యే

యువ నాయకుడు కొండారెడ్డి వ్యాఖ్యలపై కూడా ఎమ్మెల్యే స్పందించారు. మంచి చెడ్డ ఉంటాయని, అందులో మంచిది మాత్రమే స్వీకరించాలని అన్నారు. రామ రాజ్యంలో రావణుడు ఉన్నాడని, సీత ఉన్న చోటే సూర్పనఖ ఉందని ప్రస్తావించారు. పాండవులు ఉన్న చోటే కౌరవులు ఉన్నారని, మంచి ఉన్న చోటే చెడు ఉంటుందన్నారు. వీటిలో మంచిని తీసుకోవాలి తప్ప చెడును కాదని హితవు పలికారు. అమెరికా ప్రెసిడెంట్ పోస్టుకు 85 ఏళ్ల వ్యక్తి పోటీలో ఉన్నారని ప్రస్తావించారని, అయితే అంత వయసు ఉన్న వ్యక్తి రాజకీయాలకు అర్హుడు కాదన్నది తన అభిప్రాయం మాత్రమేనని గుర్తుచేశారు. 85 ఏళ్లపైబడిన వారికి ఓట్ ఫ్రం హోం వంటి అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిందన్నారు. ప్రజా సేవకు నా తండ్రి ఫిట్‌గా ఉన్నారని కొండారెడ్డి అంటున్నారని, అది ప్రకృతికి అసహజమైన విషయమని ఎమ్మెల్యే కౌంటరిచ్చారు.

40వ వార్డులో ఎన్నికల ప్రచారం

రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఆయన సతీమణి రాచమల్లు రమాదేవి బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని 40వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ రావులకొల్లు అరుణా నాగేంద్ర ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, సర్పంచ్ ప్రశాంతి, మాజీ కౌన్సిలర్ కృష్ణవేణి, ఎంపీటీసీ మేరి, గుమ్మళ్ల పద్మావతి, పార్వతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీబీఐటీ విద్యార్థుల సత్తా

చాపాడు: ఇటీవల జేఎన్‌టీయూఏ విడుదల చేసిన ఇంజినీరింగ్ థర్డ్ ఇయర్ మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కాలేజీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు చైర్మన్ వి.జయచంద్రారెడ్డి తెలిపారు. సీఎస్ఈలో బి.చైతన్యశ్రీ 87.74 శాతం, ఎస్.పాహిమా జోహా 85.91శాతం, కె.అంజలి 83 శాతం, ఈసీఈలో డి.లక్ష్మీతేజ 83.44 శాతం, ఎస్.దివ్య 83.01 శాతం, వెంకటసాయి సుజిత 81.39 శాతం, ఈఈఈలో ఎస్.హరికృష్ణ 85.05 శాతం, బీపీ గాయత్రి 84.83 శాతం, వేణుముని 84.37 శాతం, సివిల్‌లో షాహిన్ 82.36 శాతం, సాకేత్‌రెడ్డి 82.15 శాతం, ఎం.సమీర 81.29 శాతం, మెకానికల్ విభాగంలో కె. కల్యాణ్ బాషా 83.76 శాతం మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించారని తెలిపారు. విద్యార్థులు సాధించిన ఫలితాల పట్ల కళాశాల అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి



ప్రచారం చేస్తున్న నాగార్జునరెడ్డి

పోరుమామిళ్ల: ఫ్యాన్ గుర్తుకు ఓటేసి జగన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పీఆర్‌ఆర్‌డీ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి, జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ కోరారు. బుధవారం యస్. వెంకట్రామాపురం, ఎస్సీ కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లకు ఫ్యాన్ గుర్తు చూపిస్తూ ఎంపీ అభ్యర్థి అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సుధను అత్యధిక మెజారిటీ గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చెన్ను రాజశేఖర్, అమెరికన్ ఫుట్‌బాల్ ఇండియా టీమ్ కెప్టెన్ సందీప్‌రెడ్డి, సర్పంచ్ బాలయ్య, మాజీ సర్పంచ్‌లు చిన్న గురయ్య, శాంతయ్య, డాక్టర్ మాబు, నాయకులు కృష్ణారెడ్డి, రామిరెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో విద్యార్థి ప్రతిభ



పవన్‌కల్యాణ్

ప్రొద్దుటూరు: బెంగళూరుకు చెందిన కీమో సంస్థ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంపై దేశ వ్యాప్తంగా నిర్వహించిన డిజిటల్ పోటీ పరీక్షలో స్థానిక వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ ఈసీఈ చివరి సంవత్సరం విద్యార్థి వి.పవన్‌కల్యాణ్ మొదటి స్థానం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సిద్ధేశ్వర రావు బుధవారం తెలిపారు. కళాశాల చైర్మన్ హుస్సేన్‌రెడ్డి మాట్లాడుతూ తమ విద్యార్థి ప్రతిభను గుర్తించి కీమో సంస్థ వారు పవన్‌కల్యాణ్‌కు రూ.20 వేలు నగదు బహుమతి ప్రకటించారని పేర్కొన్నారు. తమ విద్యార్థులు భవిష్యత్తులో మరెన్నో అవకాశాలు పొందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ సిద్ధేశ్వర్‌రెడ్డి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

బద్వేలు అర్బన్: బద్వేలు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా సీనియర్ న్యాయవాది దేవిరెడ్డి బ్రహ్మారెడ్డి, జనరల్ సెక్రటరీగా ఆర్.ఆర్.వర్మ, ఉపాధ్యక్షులుగా డి.వి.ఎస్.ఆర్.కృష్ణ, జాయింట్ సెక్రటరీగా ఎన్.శ్రీనివాసులు, ట్రెజరర్‌గా ఎస్.రమణారెడ్డి, లైబ్రరీ సెక్రటరీగా జి.జె.ప్రభాకర్‌రావు, స్పోర్ట్స్ అండ్ కల్చరర్ సెక్రటరీగా టి.సురేష్‌బాబును ఎన్నుకున్నారు. బి.వి.రవికుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, నాగేంద్రప్రసాద్, ఉమామహేశ్వర్‌రావు, విజయకుమార్, విజయభాస్కర్‌రెడ్డి, శివకుమార్, ఎజాజ్ బాషాను కార్యవర్గ సభ్యులుగా నియమించారు. మహిళా ప్రతినిధులుగా మనీషసాయి, సాయి వెన్నెల, సాయి తపస్వి ఎన్నికయ్యారు.

నాటుసారా ఊట ధ్వంసం



నాటుసారా ఊటను ధ్వంసం చేస్తున్న ఎస్ఐ నాగమురళి, సిబ్బంది

కలసపాడు: మండలంలోని తెల్లపాడు అటవీ ప్రాంతంలోని కొండపేట గ్రామ శివారులో మంగళవారం రాత్రి 300 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ నాగమురళి తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు అటవీ ప్రాంతంలో గాలించగా నాటుసారా ఊటను కనుగొని ధ్వంసం చేసినట్లు తెలిపారు. నాటు సారా తయారీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. దాడిలో ఏఎస్ఐ నాగేంద్ర, కానిస్టేబుళ్లు రామాంజనేయులు, జగదీష్ తదితరులు ఉన్నారు.

అన్నదానం

ప్రొద్దుటూరు: స్థానిక విజయేశ్వరి వృద్ధాశ్రమం, విశ్వప్రేమ వృద్ధాశ్రమం, బొల్లవరం ఎస్సీ కాలనీలో బుధవారం మధ్యాహ్నం పోరెడ్డి సుజాత వర్ధంతి సందర్భంగా పోరెడ్డి సుజాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా పోరెడ్డి సుజాత ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, సుజాత భర్త పోరెడ్డి నరసింహారెడ్డి, సందీప్‌రెడ్డి మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

వరి, పత్తి సాగుపై అవగాహన



మాట్లాడుతున్న ఏరువాక కేంద్రం డైరెక్టర్ అంకన్న కుమార్

ప్రొద్దుటూరు: మండలంలోని ఉప్పరపల్లె గ్రామ రైతు భరోసా కేంద్రంలో బుధవారం ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం, ఊటుకూరు ఏరువాక కేంద్రం, నాబార్డు ఆధ్వర్యంలో రైతులకు వరి, పత్తి పంటలపై అవగాహన కల్పించారు. ప్రొద్దుటూరు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తిదారుల సహకార మార్కెటింగ్ సొసైటీ సంఘం లిమిటెడ్ చైర్మన్ హబీబున్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరువాక కేంద్రం డైరెక్టర్ అంకన్న కుమార్, సీఎస్‌ఏ రాష్ట్ర కోఆర్డినేటర్ ఆదినారాయణ మాట్లాడుతూ భూసార యాజమాన్యం, సేంద్రీయ వ్యవసాయం గురించి రైతులకు వివరించారు. పత్తి, వరి పంటల్లో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను తెలిపారు. ఎఫ్‌పీఓ సీఈఓ వీరమోహన్ మాట్లాడుతూ ప్రొద్దుటూరు రైతు ఉత్పత్తిదారుల సంఘం అతి తక్కువ కాలంలో రూ.50 లక్షల బిజినెస్ చేసిందని తెలిపారు. రైతుల సమస్యల కోసం కిసాన్ మిత్ర హెల్ప్‌లైన్ నంబర్ 8500983300 ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఊటుకూరు ఏఆర్ఎస్ కేంద్రం డాక్టర్ సునీల్ కుమార్ వ్యవసాయ పనుల్లో డ్రోన్‌ను ఎలా ఉపయోగించాలో వివరించారు. డాక్టర్ రాంబాబు పాడి పరిశ్రమ నిర్వాహకులు మేలైన పశుజాతులను ఎలా ఎంచుకోవాలని, వాటికి వచ్చే వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. ఈ కార్యక్రమంలో బొజ్జవారిపల్లె, ఉప్పరపల్లె గ్రామాల రైతులు, సీఎస్‌ఏ సిబ్బంది, ఎఫ్‌పీఓ సంఘాల చైర్మన్లు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జగనన్నను గెలిపించండి



అంబవరంలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఆదిత్యరెడ్డి

కాశినాయన: ప్రజలకు మేలు చేసిన జగనన్నకు ఓటు వేసి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ యువ నాయకులు దేవసాని ఆదిత్యరెడ్డి కోరారు. బుధవారం మండలంలోని అంబవరం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి జగనన్న చేసిన మేలును, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వంలో చేసిన మోసాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీగా వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యేగా డాక్టర్ సుధను గెలిపిస్తే మనందరి కోసం నిరంతరం వారు కృషి చేస్తారన్నారు. చంద్రబాబులా మోసం చేయడం వైఎస్ కుటుంబానికి చేతకాదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సురేష్, ప్రభాకర్‌రెడ్డి, గురివిరెడ్డి, ఉప సర్పంచ్ జిలాని, శేఖర్, ఖాశీంపీరా పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



విద్యుదాఘాతంతో మృతి చెందిన ఎద్దు

కలసపాడు: మండలంలోని లింగారెడ్డిపల్లె గ్రామంలో విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందింది. లింగారెడ్డిపల్లెలో రైతు పెమిరెడ్డి రమణారెడ్డికి చెందిన ఎద్దు ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో బుధవారం మేత మేస్తూ ప్రమాదవశాత్తు తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ రూ.80 వేలు ఉంటుందని రైతు తెలిపారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వలన ప్రమాదం జరిగిందని బాధితుడు వాపోయాడు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె వేయక పోవడంతోనే ఎద్దు మృత్యువాత పడిందని ఆరోపించాడు. విద్యుత్ అధికారులు, ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

పులివెందుల రూరల్: వాహనదారులు నిబంధనలు పాటించాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ బీవీ ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాహనదారులు తమ వాహనాలకు స్టిక్కర్లు అతికించరాదన్నారు. ఎన్నికల నిబంధనను వాహనదారులు పాటించాలన్నారు.

ఎన్నికల నిబంధనలపై సదస్సు



మాట్లాడుతున్న తహసీల్దారు శిరీష

పోరుమామిళ్ల: స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో బుధవారం రిటర్నింగ్ అధికారి ఆదేశాల మేరకు పోలింగ్ సిబ్బందికి ఎన్నికల విధులు, నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ వరప్రసాదరావు, తహసీల్దారు శిరీష, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి పాల్గొని మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బూతుల వద్ద ఏర్పాటు చేయాల్సిన సదుపాయాలు, ఓటర్లను ఓటింగ్‌పై అవగాహన, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ గురించి వారు వివరించారు. ఈ సమావేశంలో సెక్టార్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

మేలు చేసిన ప్రభుత్వాన్ని మరువకూడదు

ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి



సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు : ప్రజలకు సంక్షేమపథకాల ద్వారా మేలు చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజలు మరువకుండా ప్రతి ఒక్కరూ ఆదరించాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని అంబవరం గ్రామ పంచాయతీ పరిధి వేమగుంటపల్లె, కొత్తరోడ్డు, అంబవరం, కొత్తగుంటపల్లె గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించి మాట్లాడారు. జగనన్న ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాయన్నారు. 3 సార్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. రాష్ట్రంలో ఒక్క జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కోవడానికి ఎన్ని పార్టీలు కలసి వచ్చినా ఏమీ చేయలేవన్నారు. చంద్రబాబునాయుడు ఎన్ని కుట్రలు కుతంత్రాలు పన్నిన ప్రజలు ఆయనను నమ్మే పరిస్థితిలో లేరన్నారు. గతంలో అనేక హామీలను ప్రజలకు ఇచ్చి వాటిని అమలు చేయలేదన్నారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పథకాలు జగనన్నతోనే సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా, జిల్లా ఎంపీగా వైఎస్ అవినాష్‌రెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయుచున్న తనను ఫ్యాను గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మండల కన్వీనర్ శ్రీనివాసులు, గోపాల్‌రెడ్డి, తాన నాయక్, చౌడయ్య, మదుమోహన్ నాయుడు, లింగమయ్య, కృష్ణయ్య, రూబెన్, కనకరాజు, మణి తదితరులు పాల్గొన్నారు.

ప్రచారానికి అనుమతి తప్పనిసరి



మాట్లాడుతున్న జేసీ, ఆర్‌ఓ గణేష్‌కుమార్

కమలాపురం : మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని నిబంధనలు ఉల్లంఘిస్తే కేసు నమోదు చేస్తామని జేసీ, రిటర్నింగ్ ఆఫీసర్ గణేష్‌కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక ఆర్‌ఓ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాహనాలకు, బహిరంగ సభలకు, లౌడ్ స్పీకర్లకు, ఇంటింటి ప్రచారం నిర్వహించడానికి ఆర్‌ఓ నుంచి తప్పని సరిగా అనుమతి తీసుకోవాలన్నారు. కరపత్రాలు పంపిణీ చేయాలన్నా, బ్యానర్స్, జెండాలు కట్టాలన్నా అనుమతి తప్పని సరి అన్నారు. ముఖ్యంగా వాల్ రైటింగ్స్ చేయకూడదన్నారు. అనుమతి లేకుండా ప్రచారం నిర్వహించరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామన్నారు. ప్రచారం నుంచి ఓటింగ్ ముగిసే వరకు ఖర్చును నమోదు చేస్తామన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ తప్పని సరిగా పాటించాలన్నారు. ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. వలంటీర్లు ప్రచారంలో, ఎన్నికల విధుల్లో పాల్గొంటే డిస్మిస్ చేస్తామని హెచ్చరించారు.

మైనార్టీల ద్రోహి చంద్రబాబు

పులివెందుల రూరల్ : 2014-19లో ఎన్డీఏతో చంద్రబాబు జతకట్టి మైనార్టీలకు కేటాయించిన మంత్రి పదవిని పల్లె రఘునాథరెడ్డికి ఇచ్చి ఆ సామాజికవర్గాన్ని కించపరిచారని రాష్ట్ర నూరుబాషా కార్పొరేషన్ చైర్మన్ రసూల్, జిల్లా మైనార్టీ నాయకుడు నూరుల్లాలు మండిపడ్డారు. బుధవారం దూదేకుల సంఘ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు మైనార్టీల ద్రోహి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నంద్యాల ఉప ఎన్నికల్లో అన్ని సంఘాల వారు చంద్రబాబు మైనార్టీ ద్రోహి అని నిలదీయడంతో ఫరూక్‌కు ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రి పదవి ఇచ్చామని చెప్పడం నిజం కాదా అని ప్రశ్నించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2014-19లో 5 ఎమ్మెల్యే పదవులు మైనార్టీలకు ఇచ్చారన్నారు. 2024లో ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఏడుగురిని మైనార్టీ అభ్యర్థులుగా ప్రకటించిందని తెలిపారు. చంద్రబాబు మాత్రం 2 సీట్లు మాత్రమే కేటాయించారని విమర్శించారు.

తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలి

ఎంపీపీ అబుబకర్ సిద్ధిక్

ఖాజీపేట: మండలంలో ఎక్కడా తాగునీటి సమస్యలు లేకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని ఎంపీపీ అబుబకర్ సిద్ధిక్ అధికారులకు సూచించారు. ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాభావం కారణంగా భూగర్భజలాలు పూర్తిగా ఇంకిపోయాయని, అందువల్ల గ్రామాల్లో నీటి సమస్య ఎదురవుతోందని తెలిపారు. నీటి సమస్య తీవ్రంగా ఉన్న గ్రామాలను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరం అయితే నీటి ట్యాంకుల ద్వారా నీరు అందించాలని పేర్కొన్నారు. ఆర్‌డబ్ల్యూ ఏఈ ఉమామహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ మొదట ములపాక నీటిని అందిస్తున్నామని, నీటి సమస్య ఉన్న గ్రామాల్లో రైతుల బోర్ల ద్వారా నీరు అందిస్తున్నామని తెలిపారు.

విద్యుత్ అధికారుల నిద్ర పోతున్నారా?

విద్యుత్ సమస్యలపై ఆ శాఖ అధికారుల తీరుపై సమావేశంలో సభ్యులు మండిపడ్డారు. జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కరీముల్లా మాట్లాడుతూ ఖాజీపేట టౌన్‌లో ఆన్‌ఆఫ్ స్విచ్‌లు వేయాలని ఏడాదిగా అడుగుతున్నామని, ఇప్పటికి ఏర్పాటు చేయలేదని మండిపడ్డారు. వారి నిర్లక్ష్యం వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తవ్వారిపల్లె అమరేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ తవ్వారిపల్లె ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో విద్యుత్ వైర్ల తక్కువ ఎత్తులో ఉన్నాయని, చర్యలు తీసుకోవాలని, కొత్త లైన్లు వేయాలని సూచించినా చర్యలు తీసుకోలేదని విమర్శించారు. వెంటనే మరమ్మతులు చేయిస్తామని విద్యుత్ శాఖ ఏఈ హామీ ఇచ్చారు. సమావేశంలో జెడ్పీటీసీ దవనం పుష్పలత, ఎంపీటీసీలు రాముడు, చంద్ర భాస్కర్, చంద్రశేఖర్ రెడ్డి, కనపర్తి సుబ్బారెడ్డి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు మున్వర్, సర్పంచ్‌లు సుబ్బారెడ్డి, బుజ్జి, మండల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

70 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో బంగారు మునిరెడ్డి, రాచమల్లు కిరణ్‌కుమార్‌రెడ్డి

ప్రొద్దుటూరు: కొత్తపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని వివేకానందనగర్‌లో 70 కుటుంబాలు బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, రాచమల్లు కిరణ్ కుమార్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పరిపాలనకు ఆకర్షితులై యువత ఎక్కువగా తమ పార్టీలో చేరుతోందన్నారు. ఐదేళ్లలో నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అభివృద్ధి చేశారని కొనియాడారు. పార్టీలో చేరిన వారిలో కాసారపు సుబ్బారావు, కవిత, సుబ్బమ్మ, లక్ష్మి, గంగమ్మ, నాగరాజు, భరత్, చందు, వెంకటేష్, శ్రీను, శ్రీరాములు, సుబ్బయ్య, తదితరులు ఉన్నారు.

25న శ్రీ కొండా శింగరయ్య స్వామి ఆరాధన



కొండా శింగరయ్యస్వామి ఆలయం

బ్రహ్మంగారిమఠం: మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠం మిట్టమానుపల్లె రహదారిలో శ్రీ కొండా శింగరయ్యస్వామి దేవస్థానం ఉంది. ఈ ఆలయం ఎండోమెంట్ పరిధిలో ఉంది. అయినా ఆలయ నిర్వహణ కష్టంగా మారింది. ఈ నెల 25న శ్రీ కొండా శింగరయ్య స్వామి ఆరాధన మహోత్సవాలు ఒక్క రోజు జరుగనున్నాయి. ఉత్సవానికి కనీసం రూ.లక్ష ఖర్చు అవుతుందని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. స్వామికి సేవచేయడం తప్పా తనకు జీత బత్యాలు ఇవ్వడం లేదని ఆలయ పూజారి వాపోతున్నాడు. ఆలయానికి కోట్ల విలువ చేసే భూములున్నాయి. ప్రస్తుతం ఆ భూములు ఆక్రమణకు గురయ్యాయని స్థానికులు చెబుతున్నారు. ఎండోమెంట్ ఏసీ శంకర్ బాలాజీ ఆలయానికి చెందిన ఆస్తులపై ప్రత్యే శ్రద్ధ చూపుతున్నా స్థానికంగా ఆక్రమణ దారులు సహకరించకపోవడంతో ముందుకు వెళ్లలేక పోతున్నాడు. ఏడాదికి రూ.5 లక్షలు ఆదాయం ఉంటే దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉత్సవాలను నిర్వహిస్తుంది. కానీ ఆలయానికి అంత ఆదాయం వచ్చే పరిస్థితి లేదు. ఇప్పటికైనా ఆక్రమణదారుల చెర నుంచి ఆలయానికి సంబంధించిన భూములను విడిపించి.. శ్రీ కొండా శింగరయ్యస్వామి ఆరాధన ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని భక్తులు కోరుతున్నారు.

నేటి నుంచి శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు




శ్రీలక్ష్మీ నరసింహస్వామి మూల విరాట్

వల్లూరు : పాపాగ్ని నదీ తీరాన మాచిరెడ్డిపల్లెలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి 28వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈనెల 21వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఐదు రోజుల పాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. 21న ఉదయం స్వామి వారికి అభిషేకాలు, సాయంత్రం విశ్వక్సేనారాధన, ధ్వజారోహణం, అంకురారోహణం, అగ్ని ప్రతిష్ట, 22న ఉదయం ప్రధాన కళశ స్థాపన, సాయంత్రం వివిధ హోమాలు, సాముహిక విష్ణు సహస్ర నామ పారాయణం, 23న ఉదయం వివిధ హోమాలు, సాయంత్రం లక్ష్మీ సహస్ర నామ కుంకుమార్చన, 24న సాయంత్రం సుహాసినీలతో లక్ష్మీపూజ, కుంకుమార్చన, 25న మధ్యాహ్నం 11:20 గంటలకు శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కల్యాణ మహోత్సవ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ప్రతి రోజు అన్నదాన కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ఉత్సవాల్లో వివిధ పోటీలు: బ్రహ్మోత్సవాలలో పలు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందచేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 23న రాత్రి 9 గంటలకు రంగస్థల పద్యముల పోటీలు, 24న ఉదయం 9 గంటలకు ట్రాక్టర్ ట్రాలీ రివర్స్ పోటీలు, రాత్రి 9 గంటలకు తాళం భజన పోటీలు, 25న ఉదయం 9 గంటలకు చెక్క భజన పోటీలు, 10 గంటలకు అల్లెం గుండు ఎత్తు పోటీలు, మధ్యాహ్నం బండలాగుడు పోటీలు జరుగుతాయన్నారు. రాత్రి పాటకచ్చేరి జరుగుతుందని తెలిపారు.

కమనీయం.. శ్రీవారి కల్యాణం



అలంకరణలో సతీసమేతంగా శ్రీ వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు

ఎర్రగుంట్ల : పట్టణంలోని కోగటం రోడ్డు సుందరయ్య కాలనీ సమీపంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థాన పదవ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం నిర్వహించిన శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా తెల్లవారిజాము నుంచి శ్రీవారికి వివిధ అభిషేకాలు, పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవిభూదేవి శ్రీ వెంకటేశ్వరస్వామి కల్యాణంను శాస్త్రోత్తంగా వేద పండుతులు రాజేష్ వారి బృందం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారి కల్యాణంను తిలకించారు. సాయంత్రం శ్రీవారి గ్రామోత్సవంను పురవీధులలో ఘనంగా నిర్వహించారు. కోలాట బృందంతో గ్రామోత్సవం సాగింది.

ఆసుపత్రిని ప్రారంభించిన వైఎస్సార్‌సీపీ ప్రముఖులు



డాక్టర్ రాహుల్‌ను అభినందిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

బద్వేలు అర్బన్: బైపాస్‌రోడ్డులో గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారు శీనయ్య, సగర కార్పొరేషన్ చైర్‌పర్సన్ రమణమ్మ కుమారుడు డాక్టర్ జి.రాహుల్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన బంగారు శీనయ్య ఆసుపత్రిని బుధవారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ కె.సురేష్‌బాబు, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బద్వేలు లాంటి చిన్న పట్టణంలో అన్ని రకాల వసతులతో ఆసుపత్రిని ప్రారంభించడం అభినందనీయమని, పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయప్రతాప్‌రెడ్డి, కుడా చైర్మన్ గురుమోహన్, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి, వైఎస్సార్‌సీపీ యువ నాయకులు ఆదిత్యరెడ్డి, డీఎల్‌డీఏ చైర్మన్ మాధవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, పట్టణంతో పాటు వివిధ మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

వేముల : ప్రతి రోజు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ కార్యకర్త ప్రభావతి తెలిపారు. బుధవారం వేములలోని వెంకటేశ్వర అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన ఆహార పక్షోత్సవాల కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు, కిశోర బాలికలు రక్తహీనత లేకుండా పప్పుదినుసులు, చిరుధాన్యాలు, ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించడం ద్వారా వారిలో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అలాగే పిల్లల వెయ్యిరోజుల సంరక్షణ గురించి వివరించారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, తల్లులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.